క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్ : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి నెలకు సంబంధించిన పింఛన్లు మండలంలో 11,604 మందికి 5 కోట్ల 11 లక్షల 31 వేల రూపాయలు శనివారం తెల్లవారుజాము నుంచి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 3, తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు.

వైభవంగా సీతారాముల తీర్థం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : కొరువాడ గ్రామస్తులు శుక్రవారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు సీతారాముల ఆలయంలో ఉదయం నుండే పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో గ్రామానికి రావడంతో గ్రామమంతా సందడిగా మారింది. మధ్యాహ్నం గుర్రాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన గుర్రాల యజమానులకు నగదు పురస్కారాన్ని అందజేశారు.

మోదమాంబకు వెండి విరాళం



అమ్మవారికి వెండిని సమర్పిస్తున్న రాజేష్‌కుమార్

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి మూడు కుటుంబాల వారు అర కిలో వెండిని శుక్రవారం అందజేశారు. ఉప సర్పంచ్ గెంజి రాజేష్‌కుమార్, సుభద్రరావు, నర్సింహమూర్తినాయుడు దంపతుల ఆర్థిక సహకారంతో ఈ వెండిని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఆలయంలో అందజేశారు.

వరాహపురంలో పౌరహక్కుల దినోత్సవం

చీడికాడ : మండలంలో వరాహపురం గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంబేడ్కర్ కాలనీలో కాలనీవాసులకు సరైన రహదారి లేదని, తాగునీటికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురైందని, డ్రైనేజ్ సౌకర్యం లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌వో, సర్వేయరు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మాకవరపాలెంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ ఈశ్వరరావు

మాకవరపాలెం : రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈ ఈశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని కింది వీధిలో ఉపాధి పథకంలో రూ.10 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మార్చి నాటికి ఉపాధి పథకంలో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్ ఉన్నారు.

విద్యుత్ ఏఈఈకి సత్కారం



దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఏఈఈ శంకరరావును సత్కరిస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: ఇటీవల రిపబ్లిక్ డే వేడుకల్లో ఉత్తమ పురస్కారం అందుకున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈఈ కె.శంకరరావును సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏఈఈతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బదిలీ అయిన అరుణ్‌కుమార్, సమర్పణరావు, వి.వెంకటరావు, ఆర్. నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సబ్ ఇంజినీర్ ముత్యాలనాయుడు, లైన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ జె.ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

బాటసారులకు బాసటగా

సంతోషిమాత నిత్యాన్నదాన సత్రం

చురుగ్గా సత్రం పక్కా భవన నిర్మాణం

2022 ఉగాది రోజున ప్రారంభమైన కార్యక్రమం

ప్రతిరోజు మధ్యాహ్నం వందలాది మందికి భోజనం



నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న వృద్ధులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత నిత్యాన్నదాన సత్రం ఎంతో మందికి కడుపు నింపుతుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న మాటకు సార్థకత చేకూరుస్తూ కె.జె.పురం జంక్షన్‌లో శ్రీ సంతోషిమాత ఆలయం పక్కన 2022 ఏప్రిల్ 2వ తేదీన (ఉగాది పర్వదినం) నిత్యాన్నదానం లాంఛనంగా ప్రారంభించారు. ఆధ్యాత్మిక నిలయంగా మారిన కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు చొరవతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి రోజు ఈ నిత్యాన్నదాన సత్రంలో మధ్యాహ్నం సమయంలో 11 గంటల నుంచి 2 గంటల వరకు ఎంతో మంది ఆకలితో వచ్చిన వారికి అన్నదాన సత్రంలో కడుపు నింపుతున్నారు. దాతల సహకారంతో నిర్విరామంగా ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్పతనం. జన్మదినం, పెళ్లి రోజు, వర్ధంతి ఇలా ప్రతి సందర్భంలోనూ దాతలు అన్నదానానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. సత్రం నిర్వాహకుడు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు చొరవతో, దాతల సహకారంతో దినదినం అభివృద్ధి చేస్తున్నారు. ప్రతి రోజు కనీసం 120 నుంచి 150 మంది వరకు ఇక్కడ భోజనం చేస్తున్నారు. జంక్షన్‌కు సమీపంలో గల పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఈ చుట్టు పక్కల ఎటువంటి భోజన లేదా ఫలహారశాలలు లేవు. గర్భిణులు, రోగులతో పాటు వారి వెంట వచ్చే వారికి ఈ అన్నదాన సత్రం ఎంతో ఆదరువుగా ఉంది.

నూతన అన్నదాన సత్రం భవనం

అన్నదాన సత్రానికి గ్రామానికి చెందిన కీర్తి శేషులు శ్రీమతి మారుముకం కొండమ్మ పేరున 3 సెంట్ల స్థలం 2018లో కుటుంబ సభ్యులు ఉచితంగా అందజేశారు. ఈ స్థలంలో అన్నదాన సత్రం నిర్మించి అన్న వితరణ చేస్తున్నారు. దాని పక్కనే ప్రస్తుతం భారీ సత్రం నిర్మిస్తున్నారు. దాతల సహకారంతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. భవనం నిర్మాణానికి ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ లక్ష రుపాయలు విరాళంగా అందజేశారు. వీరితో పాటు ఎంతో మంది విరాళాలు అందజేశారు. ఇంకా అందజేస్తున్నారు. ఈ నిత్యాన్నదాన కార్యక్రమం దాదాపు మూడేళ్లుగా నిర్విఘ్నంగా సాగుతోంది. ప్రతి రోజు భోజనంలో అన్నం, మూడు కూరలు, స్వీటు, పెరుగు, పులిహోర, సాంబారు వడ్డిస్తున్నారు.



నిర్మాణంలో వున్న అన్నదాన సత్రం భవనం

దీక్షగా సేవలు

ఎంతో మంది గిరిజన ప్రాంతాలకు వెళ్లేవారు, పాడేరు, తదితర గిరిజన మండలాల నుంచి చోడవరం, విశాఖ, అనకాపల్లి వంటి ప్రాంతాలకు వెళ్లే వారికి, అలాగే చిరువ్యాపారులు, వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో మందికి ఈ అన్నదాన సత్రం బాసటగా నిలుస్తోంది. ప్రతి శుక్రవారం సంతోషిమాత ఆలయంలో పూజలు వ్రతాలు చేసే భక్తులు, అయ్యప్ప, భవానీ, శివ, మాలాధారణ భక్తులు కూడా ఈ అన్నదాన సత్రంలో భిక్ష చేసి వెళ్తుంటారు.



కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత నిత్యాన్నదాన సత్రం

నిత్యం వందలాది మంది కడుపు నింపుతున్న ఈ అన్నదాన సత్రం ఇంకా అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం...

అన్నదాన సత్రాన్ని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సందర్శించి నిర్వాహకులను ప్రశంసించారు. భవనానికి ధన రూపేణా, వస్తు రూపేణా దాతలు సహకారం అందించాలని ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు విజ్ఞప్తి చేశారు.

గ్రామానికే తలమానికం



కె.జె.పురం గ్రామానికే తలమానికం కె.జె.పురం జంక్షన్. ఆధ్యాత్మిక కేంద్రంగా దినదినం అభివృద్ధి చెందుతుంది. సంతోషిమాత నిత్యాన్నదాన సత్రం ఎంతో మందికి అన్నార్తుల కడుపు నింపుతోంది. మంచి ఆలోచనతో ఈ కార్య క్రమం నిర్వహిస్తున్న అమ్మతల్లినాయుడు అందరికీ స్ఫూర్తిదాయకం.

– జామి రమణబాబు, గ్రామ సర్పంచ్, కె.జె.పురం గ్రామం

దాతలకు రుణపడి ఉంటాం..



ఎంతో మందికి నిత్యం మధ్యాహ్న సమయంలో కడుపు నింపుతున్నామంటే దానికి దాతలు అందిస్తున్న సహకారం మరిచిపోలేనిది. కాగా అన్నదాన సత్ర పక్కా భవనం నిర్మాణానికి దాతలు సహకరిస్తున్నారు. మూడు అంతస్తుల సత్రం భవనం నిర్మాణంలో ఉంది. దాతలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. దాతలు సహకరించాలి.

– కాళ్ల అమ్మతల్లినాయుడు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్, అన్నదాన సత్రం నిర్వాహకుడు

గొప్ప కార్యక్రమం



ఎంతో మందికి కడుపు నింపే కె.జె.పురం జంక్షన్‌లో గల నిత్యాన్నదాన సత్రం వల్ల మధ్యాహ్న సమయంలో పట్టెడు అన్నం పెడుతున్నారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లినాయుడు చొరవతో నిత్యాన్నదానం నిర్విరామంగా సాగుతుంది. బాటసారుల నుంచి చిరు వ్యాపారుల వరకు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఈ చుట్టుపక్కల ప్రాంతంలో ఇటువంటి అన్నదాన సత్రం లేదు.

– భీశెట్టి కృష్ణ, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

ఆలోచనలతోనే సాంకేతిక విజ్ఞానం పెంపు

అవంతిలో రెండు రోజుల సాంకేతిక సదస్సు ప్రారంభం



సదస్సులో ప్రసంగిస్తున్న ఎన్‌ఐటీ డైరెక్టర్ రమణారావు



నమూనాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖులు

మాకవరపాలెం : ఆలోచనలతోనే సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని రాయపూర్ ఎన్‌ఐటీ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సినర్జీ 25 పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన సాంకేతిక సదస్సులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రంగం ఏదైనా లక్ష్యనిర్దేశం తప్పనిసరన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సాంకేతిక విజ్ఞానంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పైనా దృష్టి సారించాలన్నారు. దీని ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానాన్ని మరింత పెంపొందించడంలో భాగంగానే ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి రోజు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 54 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. వీటిలో అవంతి విద్యార్థులు 43, ఇతర కళాశాలల విద్యార్థులు 11 నమూనాలను ఉంచారని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ ప్రియాంక, పలువురు ప్రముఖులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయినికి సత్కారం



ముషిడిపల్లి హైస్కూల్లో పద్మావతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

దేవరాపల్లి : ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని కె.వెంకట పద్మావతిని ఘనంగా సత్కరించారు. స్థానిక హైస్కూల్‌లో నిర్వహించిన సభలో వెంకట పద్మావతి దంపతులను స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పూలమాలలు, సాలువాలతో ఘనంగా సత్కరించి, మెమెంటోలను అందజేశారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో-1 బి.పడాల్‌దాస్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం అప్పలరామం, ఎ.కొత్తపల్లి హైస్కూల్ హెచ్‌ఎం వై.స్వర్ణలత, పెద్దాడ వెంకటరమణ, శ్రీకాకుళం ఐఐఐటీ డైరెక్టర్ డా.ప్రొఫెసర్ కె.బాలాజీ, విశాఖ టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రసాద్, స్థానిక ఉపాధ్యాయుడు ప్రసాదరావు పాల్గొన్నారు.

కె.జె.పురంలో ఘనంగా గాంధీ తీర్థం



కె.జె.పురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు



తీర్థం సందర్భంగా అలరించిన చిన్నారుల కోలాటం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం గ్రామంలో భిన్నంగా దేశ నాయకులకు తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా జాతిపిత గాంధీజీ తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గాంధీ వర్ధంతి మరుసటి రోజున తీర్థం నిర్వహించడం పరిపాటి. గాంధీవీధికి చెందిన ప్రజలు సారథ్యంలో, సామాజికకర్త దాడి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుద్దా జగ్గారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బుద్దా కొండారావుతో పాటు స్థానికులు కొట్యాడ రఘుకుమార్, పరిమి శ్రీనివాసరావు, దొడ్డి నూకరాజు, తనకాల శ్రీను, పెంటకోట మహేష్ పాల్గొన్నారు. అవార్డు పబ్లిక్ స్కూలు విద్యార్థులు దేశభక్తి గీతాలు వినిపించారు. చిన్నారులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిల్‌లు అందజేశారు. సాయంత్రం సైకిల్ స్పీడు, స్లో పోటీలు, పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు, మహిళలు కోలాటం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : బలిఘట్టం పాకలపాడు గురువు గారు ఆశ్రమంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1968–69లో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. 55 ఏళ్ల క్రితం హైస్కూల్ విద్యను అభ్యసించిన విద్యార్థులంతా ఒక చోట చేరారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో ఇంగ్లిష్‌ను బోధించిన శాస్త్రి మాస్టార్‌ను కలిసి వారి దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు సింహాచలం, జయంతి, సత్యనారాయణ, నీలం రాంబాబు సారథ్యం వహించారు.

ఘనంగా రాజులుబాబు పండగ



గుడి వద్ద బారులు తీరిన భక్తులు

గొలుగొండ : ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఉన్న రాజులుబాబు పండగ శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధాన మార్గంలో ఉన్న ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఈ రాజులుబాబు గుడి వద్ద ప్రతి ఏటా పెద్ద ఎత్తున పండగ చేస్తారు. ఎర్రవరం, చీడిగుమ్మల, పోలవరం, ఎరకంపేట, కంఠారం తదితర గ్రామాల్లో ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. వేలాది మంది భక్తులు రావడంతో నర్సీపట్నం రూరల్ పరిధిలో సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు నిర్వహించారు. రాత్రి పై గ్రామాల్లో ప్రజలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయంలో సీసీ రోడ్డు పనులు



ఎం.కోడూరులో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం, ఆలయం లోపల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు మండల పరిషత్ నిధుల నుంచి రూ.నాలుగు లక్షల వ్యయంతో చేపట్టారు. గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు సూచనలతో ఈ పనులు చేపట్టారు. ఈ నిర్మా పనులును శుక్రవారం సాయంత్రం ఎంపీటీసీతో పాటు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, మహేష్, పర్యవేక్షించారు.

వ్యక్తిత్వ వికాసంతో చక్కని భవిత

చోడవరం రూరల్ : పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పట్ల అవగాహన ప్రతి విద్యార్థి జీవితం సరైన మార్గంలో పయనించడానికి ఉపకరిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, సెట్విస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, యూత్ క్లబ్స్ ఏర్పాటు, పనితీరు పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్విస్ సీఈవో ఎం.సత్యపద్మ ఆదేశాలతో నిర్వహించిన సదస్సులో కోఆర్డినేటర్ ఎస్.ఎ.బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మన్యూనతను విడనాడి, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, పిచ్చమ్మ, మాల్యాద్రి, ఉపన్యాసకులు మల్లిబాబు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ధర్మశ్రీ సభకు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు



సభకు వెళ్లిన ఎంపీపీ రాజారామ్, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీను తదితరులు

మాడుగుల రూరల్ : అనకాపల్లి పార్లమెంటు వైఎస్సార్‌సీపీ పరిశీలకునిగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి మాడుగుల, చీడికాడ, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. స్థానిక ఎంపీపీ రాజారామ్, మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, సిమ్మునాయుడు తరలివెళ్లారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

మాడుగుల రూరల్ : చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలు అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా పంచాయతీ కార్యాలయం డీపీఆర్‌సి రిసోర్సుపర్సన్ కె.దేముడుబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కె.జె.పురంలో గల చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలని, వానపాములు పెంపకం చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో అందరి మన్ననలు



సన్యాసయ్యను ఘనంగా సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో నిర్వర్తించిన ఎ.కోడూరు హైస్కూల్ ఉపాధ్యాయుడు వి.సన్యాసయ్య అందరి మన్ననలు పొందారని చినగదిలి మండల విద్యాశాఖాధికారి అనురాధ, ఎ.కోడూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు అన్నారు. ఎ.కోడూరు పాఠశాల ఉపాధ్యాయునిగా పని చేసిన వి.సన్యాసయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఎ.కోడూరు హైస్కూల్లో చదువులు సాగించిన సన్యాసయ్య ఉద్యోగ విరమ కూడా చదువుకున్న పాఠశాలలో పొందడం ఆనందంగా ఉందని ఎంఈవో అనురాధ పేర్కొన్నారు. 32 ఏళ్ల ఉద్యోగ నిర్వహణలో సన్యాసయ్య పలువురికి స్ఫూర్తిగా నిలిచారని హెచ్‌ఎం కామేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్లి గోవిందరావు, ఉపాధ్యాయులు, అమృతరావు, రమాదేవి, ప్రసాద్, ఎరుకునాయుడు, బంగారునాయుడు, వెంకటరావు, బొజ్జ అర్జునరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఎంపికైన లేగ దూడలు

నర్సీపట్నం : చెట్టుపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన శుక్రవారం ఏర్పాటు చేశారు. లేగ దూడల ప్రదర్శనను మాజీ ఏపీఎల్‌డీఏ చైర్మన్ డి.రాఘవేంద్రరావు, జిల్లా పశుగణాభివృద్ధిశాఖ సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు ప్రారంభించారు. మేలు జాతి పశువుల పెంపకంపై రైతులు దృష్టి సారించాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. పశువైద్య శిబిరంలో నర్సీపట్నం సహాయ సంచాలకుడు డాక్టర్ రాంబాబు, వైద్యాధికారి డాక్టర్ పుష్ప వైద్య సేవలు అందించారు. వివిధ జాతులకు సంబంధించి 40 లేగదూడలను ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి రైతుకు బహుమతి అందజేశారు. 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, కొత్తకోట డాక్టర్ బాలతేజ, రాజశేఖర్ పాల్గొన్నారు.

వాసవీమాతకు కుంకుమ పూజలు



వాసవీమాత ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



చోడవరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: దేవరాపల్లి–ఆనందపురం రహదారిలో జమ్మాదేవి పేట జంక్షన్‌లోని వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెదనందిపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

మాడుగుల రూరల్ : వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, ప్రత్యేక ఆలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీనాధు శేఖర్, కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎస్.ఎ. నాగేశవరావుతో పాటు పుట్టా బలరామ్, పాలకుర్తి శ్రీనివాసరావు, కొట్యాడ రఘు, కొట్యాడ ఉదయ్‌భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కె.జె.పురం జంక్షన్‌లో గల వాసవీమాతకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

చోడవరం రూరల్: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు 102 ఘటాలతో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన, 102 జ్యోతులతో శ్రీ చక్ర పూజ, తిరువీధి ఉత్సవం, రాత్రి ఊంజల్ సేవలతో అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. కార్యక్రమంలో అర్చక బృందం మంగళంపల్లి శ్రీకాంత్ శర్మ, డి.సుబ్రహ్మణ్యం ఆలయ కమిటీ చైర్మన్ కలగర్ల శేషగిరిరావు, యూత్ క్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.